సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు, కనిష్టంగా రూ.17 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20 మేర ధర పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు వచ్చింది.

గరిష్టం/కనిష్టం
39.8°/21.6°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం నెలకొంది. పడమటి దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు
- నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రి తరలింపు



పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. శనివారం ఆయన జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి పట్టణంలోని మార్కెట్‌యార్డులో స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను తనిఖీ చేశారు. అనంతరం ప్రత్యేక బాక్సుల్లో వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల సిబ్బంది భద్రపరచగా, వాటిని జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు కట్టుదిట్టమైన భద్రత నడుమ పంపించారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తహసీల్దార్ రమేష్, ఆరు నియోజకవర్గాల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా నుంచి 2,264 మంది దరఖాస్తు చేసుకోగా, 1,831 మంది హాజరయ్యారని కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. లేపాక్షిలో 514 మంది, టేకులోడు 383 మంది, గుండుమల 167 మంది, గుడిబండ 177 మంది, పేరూరు 256 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు.

ఐదింతల ఆరోగ్య భద్రత







ఇతని పేరు పెద్దమల్లప్ప. గుడిబండ మండలం ఫళారం. కూలి పనులు చేసుకునే ఇతనికి బ్లడ్ కేన్సర్ సోకింది. ఆస్పత్రికి వెళ్లగా లక్షలాది రూపాయలు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని మల్లప్ప హతాశయుడయ్యాడు. ప్రాణమ్మీద ఆశ వదిలేకున్నాడు. కానీ గ్రామంలోని వలంటీర్ అతనికి 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' గురించి తెలిపాడు. దీంతో పెద్దమల్లప్ప బెంగళూరులోని కిద్వాయి ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందాడు. మల్లప్ప కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.36 లక్షలు ఖర్చు చేసింది. ప్రస్తుతం అతను బ్లడ్ కేన్సర్ నుంచి కోలుకున్నారు. తన ప్రాణాలు కాపాడిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని పెద్దమల్లప్ప చెబుతున్నారు.

- పేదలకు వరం ఆరోగ్యశ్రీ
- పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన జగన్ సర్కార్
- ప్రొసీజర్ల సంఖ్య కూడా 3వేలకు పైగా పెంపు
- ఐదేళ్లలో జిల్లాలోని 13,58,095 మందికి కార్పొరేట్ వైద్యం
- ఉచిత వైద్యానికి రూ.289.39 కోట్ల వ్యయం
- నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

మడకశిర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ'ని మరింత పకడ్బందీగా అమలు చేస్తూ నిస్సహాయులకు అండగా నిలిచారు. ఉచిత కార్పొరేట్ వైద్యం ద్వారా ఎందరికో పునర్జన్మ ప్రసాదించి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

వైఎస్సార్ శ్రీకారం చుడితే..జగన్ ఊపిరి

రాష్ట్రంలోని నిరుపేదలకు కూడా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో దివంగత నేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి 'ఆరోగ్యశ్రీ' పథకానికి శ్రీకారం చుట్టారు. నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారు. ఆతర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీని విస్మరించగా పథకంగా ద్వారా నిరుపేదలు సకాలంలో లబ్ధి పొందలేకపోయారు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ 'ఆరోగ్యశ్రీకి' ఊపిరిలూదారు. ఏ జబ్బుకైనా ఆరోగ్యశ్రీ పరిధిలో ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

పరిమితి పెంపు

జగన్ సర్కార్ ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా పెంచింది. గతంలో రూ.5 లక్షల విలువైన వైద్య సేవలే ఆరోగ్యశ్రీ ద్వారా అందేవి. దీంతో పెద్దపెద్ద జబ్బుల బారిన పడిన నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీన్ని గుర్తించిన సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. దీంతో పేదలకు భారీ ఊరట లభించింది. పేదవాడు కూడా కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందడానికి అవకాశం ఏర్పడింది.

పెరిగిన ప్రొసీజర్ల సంఖ్య

రాష్ట్రంలో 2019 వరకు ఆరోగ్యశ్రీ ద్వారా 1,052 ప్రొసీజర్లకు మాత్రమే సేవలు అందించేవారు. దీనివల్ల కొన్ని వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేందుకు వీలయ్యేది కాదు. దీంతో ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధి సోకితే పూర్తి మొత్తం చెల్లించి వైద్యం పొందాల్సిన పరిస్థితి ఉండేది. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారు. ఏ వ్యాధి సోకినా ఆరోగ్యశ్రీలో చికిత్స అందేలా ప్రొసీజర్లను 3,257కు పెంచారు. దేశంలో ఏక్కడా లేని విధంగా ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పిస్తూ కోవిడ్, డెంగీ వంటి రోగాలను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చి పేదల ఆరోగ్యం పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

జిల్లాలో లక్షలాది మందికి వర్తింపు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జిల్లాలో ఇప్పటి వరకు 13,58,095 మంది ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 289.39 కోట్లు ఖర్చు చేసింది. అలాగే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి కోలుకునే వరకూ ప్రభుత్వమే ఆసరా కల్పిస్తోంది. 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా' కింద రోజుకు రూ.225 చొప్పున గరిష్టంగా నెలకు రూ.5 వేలు ఇచ్చేలా చర్యలు తీసుకుంది. ఇలా ఆరోగ్య ఆసరా కింద జిల్లాలో 78,552 మంది లబ్ధి కలగగా, ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చు చేసింది.

జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు ఇలా......

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
కదిరి	25,418	53.34
ధర్మవరం	31,964	69.80
పుట్టపర్తి	16,583	34.77
హిందూపురం	21,252	43.66
మడకశిర	8,917	21.41
పెనుకొండ	20,313	41.49
రాప్తాడు	11,448	24.92

ఐదేళ్లలో జిల్లాలో ఆరోగ్య శ్రీ అమలు ఇలా..

లబ్ధిదారులు 13,58,095

ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం రూ. 289.39 కోట్లు

'ఆరోగ్య ఆసరా' లబ్ధిదారులు 78,552

ఆసరా కోసం వెచ్చించిన మొత్తం రూ.40 కోట్లు

'ఆరోగ్యశ్రీ'నే నన్ను బతికించింది



నాకు గొంతు క్యాన్సర్ వచ్చింది. స్నేహితుల సలహా మేరకు బెంగళూరులోని కిద్వాయి ఆస్పత్రిలో చేరా. రూ.లక్షలు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే కావడంతో తీవ్ర ఆందోళన చెందా. అయితే ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని వలంటీర్ చెప్పడంతో ఆస్పత్రి నిర్వాహకులకు సమాచారం ఇచ్చాను. దీంతో వారు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నా. ఇందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు ఖర్చు చేసింది. ఆరోగ్యశ్రీ పథకమే నన్ను బతికించింది.

–మహాలింగప్ప, కదిరేపల్లి,అగళి మండలం

జగనన్నే నాకు దేవుడు



నాకు గుండె సంబంధిత వ్యాధి సోకింది. ఆపరేషన్‌కు రూ.లక్షలు ఖర్చవుతాయని డాక్టర్లు చెప్పారు. కూలి పనికి వెళ్లి జీవనం సాగించే నాకు అంత డబ్బు ఖర్చు చేసే స్తోమత లేదు. ఈ పరిస్థితిలో ఆరోగ్యశ్రీ పథకం గుర్తొచ్చింది. వెంటనే అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరా. పైసా ఖర్చు లేకుండా నాకు గుండె ఆపరేషన్ చేశారు. రూ.1.80 లక్షలను ప్రభుత్వం నా తరఫున ఆస్పత్రికి చెల్లించింది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా. ఆరోగ్యశ్రీ పక్కాగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ నా పాలిట దేవుడు.

–చంద్రకళ, ఆలూడి, అగళి మండలం

తడబాటు.. తప్పటడుగు

- నల్లచెరువు మండలాన్ని పుట్టపర్తిలో 'కలిపిన' ఎమ్మెల్యే బాలయ్య
- 'కొత్త చెరువు నియోజకవర్గ ప్రజలకు' అంటూ సింధూర ప్రసంగం

కొత్తచెరువు: ఎన్నికల వేళ కేడర్‌లో ఊపు తెచ్చేందుకు టీడీపీ అధిష్టానం 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర' పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తూ జిల్లా పర్యటనకు బాలకృష్ణను పంపింది. ఎప్పటిలాగే ఆయన నాన్నగారూ.. అంటూ ప్రసంగం ప్రారంభించి... తనదైన శైలిలో దూసుకుపోయారు. ఏం మాట్లాడుతున్నారో.. ఎవరినుద్దేశించి మాట్లాడున్నారో తెలియకుండా ప్రసంగిస్తూ పోయారు. పైగా పుట్టపర్తి నియోజకవర్గంలో నల్లచెరువు మండలం అంటూ తన అవగాహన రాహిత్యాన్ని బయటపెట్టారు. అలాగే ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా బర్త్‌రఫ్ చేసే సమయంలో రాష్ట్రంలో కొత్తచెరువులో మొదటగా అలర్లు జరిగాయని, ఆ విధంగా కొత్తచెరువుకు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఆ తర్వాత కూడా తత్తర పడుతూ సినీమా డైలాగ్‌లు చెప్పడంతో జనం బాలకృష్ణ మాట్లాడుతుండగానే వెళ్లిపోయారు.



జనాలు లేక వెలవెలబోయిన బాలయ్య రోడ్డుషో

తొక్కుకుంటూ పోతా

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కూడా బాలకృష్ణ స్ఫూర్తితో సినిమా డైలాగ్‌లే చెప్పారు. రఘునాథరెడ్డిని ఒక వైపే చూశారని, ఈసారి ఎన్నికల్లో 'తొక్కుకుంటూ పోతా' అంటూ ఏదేదో మాట్లాడి నవ్వులు పూయించారు. తర్వాత పుట్టపర్తి టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... 'కొత్తచెరువు నియోజకవర్గం' ప్రజలకు అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆ తర్వాత మామ పల్లె వెనుక నుంచి చెబుతుండగా..ఆమె పాఠం అప్పగించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తీసి..

బాలకృష్ణ ప్రసంగిస్తున్న సమయంలో టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపారు. ఎన్టీఆర్ విగ్రహానికి అధికారులు వేసిన ముసుగు తీసి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఇక హిందూపురం ఎంపీ అభ్యర్థి పార్థసారథి, జనసేన నాయకులకు సమావేశంలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో బీసీ నాయకులు, జనసేన కార్యకర్తలు నిరసన తెలిపారు. టీడీపీలో బీసీలకు గౌరవం లేదని చర్చించుకున్నారు.

సీఎం జగన్‌పై దాడి పిరికిపంద చర్య

- నిందితులను గుర్తించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతల నిరసన
- ముదిగుబ్బలో రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ముదిగుబ్బలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి పిరికిపంద చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ప్రజల్లో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు అతని కూటమి నేతలే సీఎంపై దాడి చేయించారన్నారు. వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎంపై దాడి ఘటన ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎక్కడికక్కడ నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి ముదిగుబ్బ మండల కేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద వైఎస్సార్ సీపీ నేతలు రోడ్డుపై బైఠాయించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ... 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు వస్తున్న ప్రజా దరణను చూసి ఓర్వలేక చంద్రబాబు అతని మిత్ర పక్ష పార్టీలు కుట్ర చేసి సీఎంపై రాళ్లతో దాడి చేయించడం సిగ్గు చేటన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. దాడి చేసిన వారిని గుర్తించి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడుతున్న రాజకీయ పార్టీలపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, కొట్టాల కృష్ణ, చవ్వా కృష్ణారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

'పల్లె'పై పగ.. బీసీల పొగ!

- వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్న టీడీపీ బీసీ నేతలు
- ఇప్పటికే విశ్రాంత డీఎస్పీ వేణుగోపాల్ చేరిక
- త్వరలోనే మరి కొందరు బీసీలు టీడీపీకి గుడ్‌బై
- పుట్టపర్తి నియోజకవర్గంలో భారీగా పడిపోతున్న టీడీపీ గ్రాఫ్



సాక్షి, పుట్టపర్తి: టీడీపీ అధిష్టానం అవలంబిస్తున్న విధానాలు...స్థానిక నేత పల్లె రఘునాథరెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలపై ఆ పార్టీలోని బీసీ వర్గాల నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. టికెట్ కేటాయింపు విషయంలో నియోజకవర్గంలోనే ఎక్కువ ఓటు బ్యాంకు కలిగిన తమను కాదని మరోసారి 'పల్లె' కుటుంబానికే పట్టం కట్టడాన్ని బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్లు సైకిల్ దిగి ఫ్యాన్ కిందకు చేరారు. మరికొందరు అదే బాటలో నడుస్తున్నారు.

'క్యాష్' పాలిటిక్స్

పల్లె రఘునాథరెడ్డిపై అసమ్మతి ఎక్కువ కావడంతో అభ్యర్థిని మార్చాలని స్థానిక టీడీపీ నాయకులు అధిష్టానానికి విన్నవించారు. అయితే 'క్యాష్' పాలిటిక్స్ అవలంబిస్తున్న టీడీపీ అధిష్టానం వద్ద పల్లె రఘునాథరెడ్డి తనదైన శైలిలో లాబీయింగ్ చేసుకుని కోడలు పల్లె సింధూరాకు టికెట్ ఇప్పించుకున్నారు. ఫలితంగా చంద్రబాబు, నారా లోకేశ్ తీరుపై పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ సీనియర్లు గుర్రుగా ఉన్నారు.

బీసీలకు టీడీపీ అన్యాయం

పుట్టపర్తి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానివే అత్యధిక ఓట్లు ఉన్నాయి. అందులో చాలామంది నాటి నుంచి టీడీపీ వెంట నడుస్తున్నారు. అయితే రాజకీయంగా ఎదగనీయకుండా.. పల్లె రఘునాథరెడ్డి అణగదొక్కారు. అయినప్పటికీ అదే పార్టీలో కొనసాగిన బీసీ నేతలు ఈ సారి పుట్టపర్తి టికెట్ బీసీలకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు. దీంతో చంద్రబాబు కూడా తొలుత ఓకే అన్నారు. ఆ తర్వాత పల్లెకే పట్టం కడుతూ ఆయన కోడలికి టికెట్ కేటాయించారు. దీన్ని బీసీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

అడ్డం తిరిగితే బెదిరింపులు

పల్లె రఘునాథరెడ్డి తీరు బాగోలేదని.. ఆయనకు టికెట్ ఇస్తే పని చేసేది లేదని అధిష్టానం వద్ద తమ అసమ్మతి తెలిపిన వడ్డెర్లపై దాడి జరిగింది. పల్లె రఘునాథరెడ్డి తన అనుచరుల ద్వారా తమపై దాడి చేయించారని వడ్డెర సామాజిక వర్గానికి చెందిన పల్లపు జయచంద్రమోహన్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రబాబు వద్ద పంచాయితీ జరిగినట్లు సమాచారం.

జగన్ న్యాయం చేస్తారని నమ్మి...

వైఎస్సార్ సీపీలో బీసీ నాయకులకు పెద్దపీట వేస్తున్నారు. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ టికెట్ల వరకూ బీసీలకు జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నామినేటెడ్ పోస్టులనూ ఎక్కువగా బీసీలకే కట్టబెట్టారు. ఈక్రమంలోనే టీడీపీలోని బీసీ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. పుట్టపర్తి టికెట్ ఆశించి భంగపడ్డ రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్, తిరుపతేంద్ర ఇప్పటికే వైఎస్సార్‌సీపీలో చేరారు. త్వరలోనే మరికొందరు టీడీపీ సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. వారు కూడా ఏ క్షణంలోనైనా కండువా మార్చడం ఖాయమని అనుచరులు చెబుతున్నారు.

కొనసాగుతున్న వైఎస్సార్‌సీపీ హవా

పుట్టపర్తి నియోజకవర్గంలో ఐదేళ్లుగా 'ఫ్యాన్' ప్రభంజనం సృష్టిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జయకేతనం ఎగురవేశారు. ఆ తర్వాత మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 15 చోట్ల వైఎస్సార్ సీపీ జెండా ఎగిరింది. ఆరు మండలాల జెడ్పీటీసీ స్థానాలతో పాటు అన్ని మండల ఎంపీపీ పదవులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సంక్షేమ లబ్ధితో జనమంతా జగన్‌కు మద్దతు పలుకుతుండగా... వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు.

కుర్లపల్లిలో ఆహార నమూనాల సేకరణ



కుర్లపల్లిలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సెల్వియా సోలమన్

కనగానపల్లి: మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామంలో శనివారం జిల్లా వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఒక ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆహారం కలుషితమై పలువురు అస్వస్థతకు గురైన విషయం తెల్సిందే. దీంతో స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్య సిబ్బంది శనివారం గ్రామానికి వెళ్లి రోగులకు వైద్య చికిత్సలు అందించారు. మరోవైపు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సెల్వియా సోలమన్ పర్యవేక్షణలో శనివారం ఉదయం నుంచి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ... కలుషిత ఆహారం తిన్నవారికి వాంతులు, విరేచనాలు కావటంతో చాలా మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి 108, ప్రవేటు వాహనాల్లో ధర్మవరంలోని ఆస్పత్రులకు రోగులను తరలించి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. బాధితులు చాలా మంది కోలుకున్నారన్నారు. అయినప్పటికి గ్రామంలో మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. అలాగే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార నమూనాలు సేకరించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ మనోహర్, హెల్త్‌సూపర్ వైజర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓలు హరికృష్ణ, వేణుగోపాల్, ఆరోగ్య కార్యకర్తలు మోహన్‌కుమార్, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.



ఆహారం నమూనాలు సేకరిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

రూ.7.10 లక్షల నగదు సీజ్

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్టులో శనివారం ఎలాంటి రసీదులూ చూపని రూ.7.10 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. కర్ణాటక వైపు నుంచి వచ్చిన ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో పోలీసులు నగదును గుర్తించారు. గొర్రెలను విక్రయించి నగదు తెస్తున్నట్టు వారు చెప్పారు. అయితే అందుకు సంబంధించిన రసీదులు చూపి నగదు తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు. డీటీ యూనిస్ నగదు సీజ్ చేసి ట్రెజరీకి తరలించారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో బలవన్మరణం


నాగేంద్ర (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఉద్దండి నాగేంద్ర (43) కుటుంబ కలహాలతో బలవన్మరణం చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉద్దండి నాగేంద్ర కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతడు మద్యం తాగి తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఆరునెలల క్రితం భార్య రామసుబ్బమ్మ భర్త నాగేంద్రతో గొడవపడి గార్లదిన్నెకు వెళ్లిపోయింది. 20 రోజుల క్రితం కుమారుడిపై దాడి చేసి గాయపరిచాడు. ఇతడి వ్యవహారశైలి నచ్చక పోవడంతో కుటుంబ సభ్యులు దూరంగా ఉండటంతో నాగేంద్ర ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోపాటు ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురైన నాగేంద్ర శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య, కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థి ఆత్మహత్య

- తల్లిదండ్రులు మందలించారని అఘాయిత్యం


మృతుడు నాగచైతన్య

ధర్మవరం అర్బన్: బడికెళ్లలేదని తల్లిదండ్రులు మందలించినందుకు ఐదో తరగతి విద్యార్థి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో డ్రైవర్ రంగప్ప, శ్రీదేవి దంపతులు ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్‌కాలనీలో నివసిస్తున్నారు. వీరి కుమారుడు నాగచైతన్య (11) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా బడికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు శనివారం మందలించారు. అనంతరం తండ్రి డ్యూటీకి వెళ్లిపోయారు. స్కూలుకెళ్లేందుకు రెడీ అవుతానని గదిలోకి వెళ్లిన నాగచైతన్య ఎంతసేపటికీ బయటకు రాలేదు. తల్లి గదిలోకి వెళ్లి చూడగా కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు వచ్చి నాగచైతన్యను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఎంత పనిచేశావు నాయనా అంటూ తల్లి గుండెలవిసేలా రోదించింది. స్థానికుల సమాచారంతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- మాక్‌డ్రిల్స్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ఈ వేసవి సీజన్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకూ ఎండలు పెరిగిపోతుండటంతో బయటకు రావాలంటే జనం భయపడిపోతున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా అగ్ని ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాలు నివారించి.. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్స్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని ఏడీఎఫ్ఓ నాగరాజునాయక్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో తొలిరోజు ఆదివారం అమరవీరులకు నివాళి, 15న బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 16న అపార్టుమెంట్లు, 17న విద్యాసంస్థలు, 18న గ్యాస్ గోదాములు, ఆయిల్ ఫార్మ్‌లు, 19న ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ నెల 20న అన్ని వర్గాల ప్రజలకు ప్రమాదాల నివారణపై వర్క్‌షాప్ నిర్వహించడంతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు.

అందుబాటులో అగ్నిమాపక సేవలు..

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎదుర్కొనేందుకు జిల్లా అంతటా అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉంది. అవసరమైన పరికరాలు, యంత్రాలు ఇంజిన్లు రెడీగా ఉన్నాయి. అడ్వాన్స్ వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్, రెస్క్యూ ఫైర్ ఇంజిన్, ట్రూప్ క్యారియర్, ఫైర్ బుల్లెట్ బైక్, మిస్ట్ జీపులు, అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, మడకశిర అగ్నిమాపక కార్యాలయాలు ఉన్నాయి. ఆరుగురు ఫైర్ అధికారులతో పాటు జిల్లాలో 100 మంది సిబ్బంది, 24 మంది హోంగార్డులు ఉన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, ఇంజిన్లు సిద్ధంగా ఉన్నాయి. కాలం చెల్లిన ఇంజిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి అగ్నిమాపక శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో ఒక అగ్నిమాపక అధికారి, ఇద్దరు సహాయక అధికారులు తరచూ వాహనాల కండీషన్‌ను తనిఖీ చేస్తుంటారు.

జాగ్రత్తలు పాటించాలి

చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వకూడదు. దుస్తులకు నిప్పు అంటుకుంటే భయంతో పరిగెత్తకుండా దుప్పటి చుట్టుకోవాలి. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు. మండుతున్న పొయ్యిపై వస్తువులను దూరం నుంచి అందుకోవాలని ప్రయత్నించకూడదు. పాడైపోయిన గ్యాస్ ట్యూబ్ స్థానంలో ఐఎస్ఐ మార్కు గల కొత్త ట్యూబ్‌ను అమర్చాలి.

జిల్లాలో ఫైర్ స్టేషన్ల ఫోన్ నంబర్లు

అగ్నిమాపక కేంద్రం	ల్యాండ్‌లైన్	మొబైల్ నంబర్
ధర్మవరం	08559-220626	99637 40213
హిందూపురం	08556-220888	99637 39702
కదిరి	08494-224266	73373 95556
మడకశిర	08493-288101	99637 40643
పెనుకొండ	08555- 220299	99667 40127
పుట్టపర్తి	08555-287299	99637 40363

తల్లిదండ్రులు మందలించారని మరొకరు..


నందిని (ఫైల్)

రొద్దం: సెల్ ఫోన్, టీవీ చూడటం మాని చదువుపై ధ్యాస పెట్టాలని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటర్ విద్యార్థిని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ బాషావలి కథనం మేరకు.. రొద్దం మండలం కలిపి గ్రామ పంచాయతీలోని కె.మరువపల్లికి చెందిన కుళ్లాయప్ప, కమలమ్మ దంపతుల ఒక్కగానొక్క కూతురు నందిని (15) పరిగి మండలం పైడేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. టీవీ, సెల్‌ఫోన్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో తల్లిండ్రులు శనివారం మందలించారు. క్షణికావేశంతో నందిని ఇంటిలో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరివేసుకుని ప్రాణం తీసుకుంది. గారాబంగా పెంచుకున్న కూతురు ఇలా అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- చోరీ సొత్తు స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్

శింగనమల: నాయనపల్లి క్రాస్‌లో నాలుగు రోజుల క్రితం జరిగిన చోరీ కేసులో నిందితులైన ముగ్గిరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీధర్ శింగనమల పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువుకు చెందిన సయ్యద్ షేక్, ధర్మవరానికి చెందిన బోయ నాగర్జున, జింకా సాయి తరణ్ జల్సాలకు అలవాటు పడ్డారు. జల్సాలు తీర్చుకోవడానికి దొంగలుగా మారారు. ఈ క్రమంలో ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి శింగనమల మండలం నాయనపల్లి క్రాస్‌లో కమలమ్మ అనే మహిళ ఇంటికి తాళం వేసి ఉండటం గమనించారు. ఆ సమయంలో కమలమ్మ మిద్దెపై నిద్రిస్తున్నారు. ముగ్గురు దొంగలు తాళం తెరిచి లోనికి ప్రవేశించి బీరువాలోనున్న రూ.5లక్షల నగదు, రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారం ఎత్తుకుని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం నాయనపల్లి క్రాస్‌లో ముగ్గురూ అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో సమాచారం అందుకున్న పోలీసులు పట్టుకొని తమదైన శైలిలో విచారించడంతో దొంగతనం ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.5,61,000 నగదు, 3 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా పని చేసిన ఎస్ఐలు చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి సిబ్బందిని ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న ఆటో

- ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలు


అంజక్క


అశ్వత్థమ్మ


నాగమ్మ


హనుమంతు


ప్రమాద దృశ్యం

మడకశిరరూరల్: విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు... గొడనహళ్లికి చెందిన ఏడుగురు మహిళా కూలీలు శనివారం ఉదయం చందకచర్లలో కూలిపనులకెళ్లారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఆటోలో తిరుగుపయనమయ్యారు. గొడనహళ్లి సమీపంలో ఆటో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగి ఆటో మీద నుంచి కిందకు పడింది ఈ ఘటనలో ఆటోలో ఉన్న మహిళా కూలీలు పి.అశ్వత్థమ్మ, నాగమ్మ, అంజక్క, ఆర్.అశ్వత్థమ్మతో పాటు ఆటో డ్రైవర్ హనుమంతుకు తీవ్రంగా గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే వారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నలుగురిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు. చికిత్స పొందుతున్న వారిని సర్పంచ్ పుట్టమ్మ, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

హిందూపురంలో రూ.8 లక్షల పట్టివేత


హిందూపురంలో పట్టుబడిన అనధికారిక నగదు


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

హిందూపురం అర్బన్: హిందూపురంలోని చిన్న మార్కెట్ వద్ద శనివారం రాత్రి టూటౌన సీఐ రియాజ్ అహమ్మద్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న గౌరీబిదనూరుకు చెందిన హెచ్ఎన్ నాగరాజు, చంద్రశేఖర్‌ను తనిఖీ చేయగా.. వారి వద్ద రూ.8,08,530 నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించి వారి వద్ద ఎటువంటి పత్రాలూ లేవు. ఈ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు సత్యం, సునీల్ పాల్గొన్నారు.

రూ. 7.22 లక్షల నగదు సీజ్

తనకల్లు: చీకటిమానిపల్లి చెక్‌పోస్ట్ సమీపాన వాహనాల తనిఖీలో పట్టుబడిన రూ.7.22 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ ధరణిబాబు శనివారం తెలిపారు. మదనపల్లి నుంచి ఓడీ చెరువుకు వెళ్తున్న మూడు బొలెరో వాహనాల్లో పై నగదు లభించింది. కాగా తాము గొర్రెల వ్యాపారులమని, మదనపల్లి సంతలో గొర్రెలను విక్రయించగా వచ్చిన నగదు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారని బాధితులు తెలిపారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలను తీసుకొస్తే డబ్బు తిరిగి చెల్లిస్తామని పోలీసులు చెప్పారు.

రూ.2.82లక్షల నగదు స్వాధీనం

ధర్మవరం రూరల్: పట్టణంలోని ఎర్రగుంట వై జంక్షన్‌లో డీఎస్పీ డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. బుక్కపట్నం మండలం పి.అగ్రహారానికి చెందిన ఆర్వేటి రామాంజినేయులు ఎటువంటి పత్రాలు/ రసీదులు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.82 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ఎన్నికల నియమావళి సందర్భంగా నిర్దేశించిన విలువకు మించి డబ్బు రవాణా చేయడం నేరమని సీఐ పేర్కొన్నారు.

కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు

- స్పీడ్‌పోస్టు ద్వారా ఇంటికే పంపిణీ



హోలోగ్రామ్‌తో కూడిన కొత్తగా ఓటరు కార్డు

హిందూపురం టౌన్: కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి కేంద్ర ఎన్నికల కమిషన్ సరికొత్త ఓటరు గుర్తింపు కార్డులు (ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు –ఎపిక్) మంజూరు చేస్తోంది. వీటిని స్పీడ్ పోస్టులో నేరుగా వారి ఇళ్లకే పంపుతోంది. దీంతో పాటు వారికి అభినందనలు తెలియజేస్తూ, ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా కోరుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందేశంతో కూడిన పత్రాలు అందజేస్తోంది.

భద్రతా ప్రమాణాలతో..

నూతన ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాయి. నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను నివారించేందుకు, ట్యాంపరింగ్ చేసేందుకు వీలు లేని విధంగా దీనిపై మన దేశ చిత్రపటంతో కూడిన హోలోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ పీవీసీ కార్డులపై ఓటర్ల ఫొటోలు గతంలో కంటే మరింత స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. దీంతో పాటు ఓటరు పూర్తి పేరు, చిరునామా తదితర వివరాలను ఇంగ్లిషు, తెలుగు భాషల్లో ముద్రించారు. అధికారుల లెక్కల ప్రకారం శ్రీసత్యసాయి జిల్లాలో 13,97,697 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో కొత్తగా ఓటు హక్కు పొందిన 26,026 మందితో పాటు నియోజకవర్గ మార్పు, ఓటరు వివరాల్లో సవరణలు, చిరునామాల్లో మార్పులు చేసుకున్న వారు కూడా ఉన్నారు. వీరందరూ తమ గుర్తింపు కార్డును ఎన్నికల కమిషన్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారిని ప్రోత్సహించేందుకు ఎన్నికల కమిషన్ వారికి పీవీసీ కార్డులను స్పీడ్ పోస్టులో పంపిస్తోంది. ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారు ఆదివారం లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలు వీరే


విజేతలను ప్రకటిస్తున్న ఆర్టీసీ డీఎం సురేష్‌కుమార్

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ప్రయాణికులను ప్రోత్సహిస్తూ రాయదుర్గం నుంచి ఉరవకొండ రూట్‌లో నిర్వహించిన లక్కీడిప్ కార్యక్రమంలో భాగంగా శనివారం విజేతలను ప్రకటించారు. ఆర్టీసీ డీఎం సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రయాణికుల సమక్షంలో పట్టణంలోని పాతబస్టాండ్‌లో లక్కీడిప్ తీశారు. మొదటి బహుమతి కె.మున్నీ (కణేకల్లు), రెండో బహుమతి జగన్నాథరెడ్డి (గ్రామదట్ల), మూడో బహుమతి పాండు వరప్రసాద్(పాల్తూరు)కు లభించింది. ఫోన్ చేసి విజేతలకు సమాచారం అందజేసి ఆర్టీసీ డిపోలో బహుమతులు తీసుకెళ్లాలని సూచించారు.

ఓటేసినట్లుగా వేలికి సిరా చుక్క

- రెండోసారి వేయకుండా ప్రత్యేక ఏర్పాటు



అనంతపురం అర్బన్: ఎన్నికల పోలింగ్‌లో ఓటు వేసిన ప్రతి ఒక్కరి వేలికి సిరా చుక్క పెడతారనే విషయం మీకు తెలుసు కదా.. ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్న తరువాత మరోసారి ఓటు వేయకుండా నిరోధించేందుకు ఇదో ప్రత్యేక ఏర్పాటు. ఒకసారి సిరా గుర్తు వేలిపై పడితే కొన్ని వారాల పాటు చెరిగిపోదు. అసలు ఈ సిరా చుక్క వాడకం తొలిసారి ఎప్పుడు మొదలయ్యింది..? దాని ప్రత్యేకత ఏమిటి..? వివరాలు మీ కోసం..

ఎందుకు చెరిగిపోదంటే...

ఓటరు వేలికి వేసే సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వేసిన వెంటనే చెరిగిపోదు. సూర్యుని వెలుతురు తగలగానే ఆరిపోతుంది. 2006 ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి ఓటరు ఎడమ చేతి చూపుడు వేలు గోరు పైభాగం నుంచి కింది వరకు సిరా గుర్తు వేస్తున్నారు. అంతకు ముందు గోరు పైభాగపు చర్మంపైననే వేసేవారు.

సిరా తయారీ ఎక్కడంటే

సిరాను కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) అనే కంపెనీ తయారు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 1962లో సిరా ఉత్పత్తి కోసం ఈ కంపెనీకి అనుమతి ఇచ్చింది. నేషనల్ ఫిజికల్ లేబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కంపెనీకి అప్పగించారు. అప్పటి నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా... ఈ సిరాను సరఫరా చేస్తుంటారు.


ఓటరు వేలికి సిరా చుక్క పెడుతున్న దృశ్యం

1950లో పేటెంట్

ఓటర్లకు సిరా వేసే విధానం చాలకాలం పాటు లేదు. 1950 సంవత్సరంలో ఈ సిరా పేటెంట్‌ను భారత్‌లోని నేషనల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్ఆర్‌డీసీ) పొందింది. ఆ తరువాత సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్)కు చెందిన నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (ఎన్‌పీఎల్) ఈ సిరాను అభివృద్ధి చేసింది. అటు తరువాత సిరా ఉత్పత్తికి మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష లిమిటెడ్ అనే చిన్న కంపెనీకి అనుమతి ఇచ్చింది. ఈ కంపెనీని 1937లో మైసూర్ మహారాజు కృష్ణరాజ వడియార్ స్థాపించారు. ఈ కంపెనీ 1962లో జరిగిన మూడో సార్వత్రిక ఎన్నికల సమయంలో తొలిసారి ఈ సిరాను మైసూర్ ప్రాంతంలోనే వాడారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల పోలింగ్‌లో వాడుతున్నారు.


సిరా డబ్బీలు

5 ఎంఎల్ వాయిల్ 300 మందికి

సిరా 5 ఎంఎల్ (మిల్లీలీటర్ల) వాయిల్ 300 మందికి సరిపోతుందని అంచనా. ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోసం 30 లక్షల సిరా వాయిల్స్ అవసరం. ఇందుకోసం రూ.55 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

పలు దేశాలకు సిరా సరఫరా

దేశీయంగా తయారవుతున్న సిరాకు అంతర్జాతీయంగా చాలా డిమాండ్ ఉంది. మన దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్నికలకూ సరఫరా చేయడంతో పాటు 1976 నుంచి 25 నుంచి 30 దేశాలకు ఇక్కడినుంచి ఎగుమతి అవుతోంది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, నేపాల్, మయన్మార్, ఇరాక్, ఇండోనేషియా, లెబనాన్, అల్జీరియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, సూడాన్, సిరియా, టర్కీ, ఈజిప్టు, తదితర దేశాల్లో ఎన్నికల సమయంలో ఈ సిరాను వినియోగిస్తారు.